మాయాలోకంలో
కష్టాల సుడిగుండంలో
చిక్కుకున్న
ఆమె కథ?

# లేడికూన

శ్రీమతి
పి.వి.శేషారత్నం
కథ

కృష్ణవేణి ఆలోచన ఎంతకీ తెగడంలేదు.

సుషమ తన ప్రాణంలో ప్రాణం —

తన రక్తంలో రక్తం—

తన జీవితానికి కరదీపిక—

పుట్టినదాది తను ఏనాడూ సుఖపడింది లేదు —

తల్లిని మింగేసిందని అమ్మమ్మవాళ్లు తనని ఈసడించుకునేవారు.

తండ్రి మళ్లీ పెళ్లిచేసుకున్నాడని తెలిసి తనని తండ్రిదగ్గర దింపి వెళ్లిపోయారు.

వచ్చిన సవతి తల్లికి తను ఎప్పుడూ అడ్డంగానే కనిపించేది. తనొక అనవసర ప్రాణిలా అనిపించేదావిడకి.


వయసు మీరాక పెళ్లి చేసుకోవడం — అదీ రెండో పెళ్లివాడిని చేసుకోవడం అందులోనూ బిడ్డతండ్రి — ఆవిడకి కలిగిన అసంతృప్తినంతా తనమీద అక్కసు రూపంలో వెళ్లగక్కేది.

తండ్రి ఎందుకో తనని ఎక్కువ పట్టించుకునేవాడు కాదు.

తన తల్లిని ఎంతో ప్రేమించేవాడని విన్నది. కాని తనంటే ఎందుకు ఏమీ పట్టని భావం— ఆడపిల్ల అనా లేక భార్య చావుకి కారణమైనదనా? ఏమోగాని రెండో పెళ్లాం చేతిలో కన్నబిడ్డ తల్లడిల్లిపోతోందని తెలిసే తనని కానట్టే వుండిపోయాడాయన.

ఎవరికీ అక్కర్లేకుండానే కాలంతోపాటు సాగి తను పెరిగి పెద్దదయింది. వయస్సులో వున్న తనకి ఎవరైనా రవంత అభిమానం చూపిస్తే పొంగిపోయేది. అది తన వయస్సుపై ప్రేమ అని తెలిసేదికాదు.

తెలిసేసరికి ఆలస్యమైపోయింది. తన



కన్నెత్వాన్ని దోచుకున్న తుమ్మెద చెప్పకుండా ఎగిరిపోయింది.

సవతితల్లి విషయం తెలిపి నానా రభసా చేసింది. ఎప్పట్లాగే తండ్రి తనని కానట్టే వుండిపోయాడు.

మెడబట్టి బయటకు గెంటెంది సవతల్లి.

ఆ అగమ్యగోచర పరిస్థితిలో కనిపించిన రైలెక్కేసింది తను — లేత మొగ్గలాంటి

తను కుమిలి కుమిలి ఏడుస్తుంటే ఓ చెయ్యి తన తల నిమిరింది.

తలెత్తి చూస్తే కరుణారస దృక్కులలో ఒక స్త్రీ పక్కనున్న వ్యక్తి ఆమె భర్తట — బిడ్డలు లేనివాళ్ళు పుణ్యతీర్థాలు సేవించి తిరిగి ఇంటికి వెళ్తున్నారు.

తనకేమీ భయంలేదని — తామున్నామని ఓదార్చి తను ఇంటికి తీసుకెళ్లారు. అప్పట్నుంచీ అదే తన ఇల్లయింది.

కానీ లేడికూన అందరికీ అలుసే —

బిడ్డలు పుట్టే యోగంలేని ఆమె తన కాశ్రయమిచ్చింది అనుకుందేగాని ఉచ్చులో బిగిస్తోందని గ్రహించలేకపోయింది.

వారం తర్వాత రెండోసారి ఆమె భర్తతో దోచుకోబడింది.

వెక్కి వెక్కి ఏడుస్తున్న తనని అక్కున చేర్చుకుందామె.

"నీకేం అన్యాయం జరుగదు కృష్ణవేణీ! నా భర్తనిచ్చి పెళ్లిచేస్తాను. నాకులేని అభ్యంతరం లోకానికేమిటి?"

తను వట్టి మనిషి కాదని గ్రహించి ఆ గర్వానికి కారణం తన భర్తేనని మురిసిపోయి తన ఇంట్లో ఓ బిడ్డ పారాడుతాడని పరిపెట్టుకుంది.

పెళ్లిచేస్తానన్న ఆమె — పెళ్లిచేసుకుంటానన్న అతను — యాదగిరి తర్వాత ఆ మాటెత్తలేదు.

తనూ అడగలేదు.

లోకానికి తను యాదగిరి రెండో భార్య.

మొదటి భార్య ఔదార్యాన్ని అంతా శ్లాఘించేవారేకాని తనకి జరిగిన అన్యాయం ఎవరికీ తెలియదు. చెప్తే తనకే నగుబాట్లు—

పైగా అదీ ఒకందుకు మంచిదే అనుకుని అప్పటి పరిస్థితిలో — కారణం సవతి తల్లి తనని వెళ్లగొట్టేసరికే తను గర్భవతి — ఆ విషయం తను ఆ తర్వాతకూడా ఎప్పుడూ చెప్పలేదు.

ఏదో బిడ్డ భూమ్మీద పడేవరకు వాళ్ల నీడ తలదాచుకుందామనుకుంది. కాని విధి ఏం చేసింది?

ఆడపిల్ల అని అతను పెదవి విరిచినా ఆమె తనని వదలలేదు.

ఆమె ఆలన పాలనలో తన సుషమ పదహారేళ్లు సంతరించుకుంది.

సుషమకి మరో నాలుగేళ్లకి పెళ్లి చేసేస్తే తను ఏమైపోయినా ఫరవాలేదు అనుకుని అక్కడ ఎన్ని అవమానాలు జరుగుతున్నా భరిస్తూనే వుంది.

కానీ పులిమీద పుట్ర — ఇంత త్వరగా వచ్చి పడుతుందనుకోలేదు.

"కృష్ణవేణీ!" ఓరోజు ఆదరాబాదరాగా పరుగెత్తుకొచ్చాడు యాదగిరి.

"నా కూతురిని అదృష్టం వరిస్తోంది"

అతనెప్పుడూ అలాగే అంటాడు. అదో తృప్తి. ఇది నా కూతురు సుమా నీకే అధికారం లేదు అనే అధికారం అందులో ధ్వనిస్తుందితప్ప అతని సెమన్ రిపోర్టు తను చదివిందనీ అతనెప్పటికీ బిడ్డతండ్రి కాలేడని తనకి తెలుసుననీ అతనికి తెలియదు. తనూ చెప్పదు.

"ఏం మాట్లాడవు? సీతాలక్ష్మి ఇలారా — ఈ మొద్దుకి చెప్పినా గోడకి చెప్పినా ఒకటే" మొదటి భార్యని పిలిచాడు ఎప్పటి ధోరణిలో.

"సుషమను అరబ్బీ షేక్ చూశాడట.

పెళ్లిచేసుకుని దుబాయ్ తీసుకెళ్తానని షేర్ ఖాన్‌తో కబురుచేశాడు. మనకి రెండు లక్షలు ఇస్తారుట. అది వాళ్ల ఆచారమట. ఏమంటావ్?''

''డబ్బు పేరెత్తితే సీతాలక్ష్మికి ఒళ్లు తెలియదు — 'ఇష్టమేనని చెప్పావా లేదా? ఆలస్యం చేస్తే అవకాశం పోతుంది!

తన గుండె జల్లుమంది. 'అమ్మో వాళ్లు మనుషులా రాక్షసులా? వాళ్లకేం రక్త సంబంధం వుంది. సుషమతో దాని బాగోగులు ఆలోచించేందుకు — పదహారేళ్లు ఇంట్లో పెరిగిందనైనా లేక రెండు లక్షలు పేరు వినేసరికి ఈవిడగారు ఎలాగైపోయిందో —

''వీల్లేదు. నా బిడ్డని అమ్మడానికి వీల్లేదు'' అన్నేళ్ల తర్వాత ఎదిరించి మాట్లాడింది ఆరోజే —

''అమ్మడమేమిటి నీకు మతిపోయిందా? ఆడపిల్లకి పెళ్లిచెయ్యవా? సిరి రా మోకాలొడ్డకు — ఏడాదికోసారి తీసుకొచ్చి చూపిస్తాడట షేక్ — అక్కడది మహారాణిలా వుంటుంది గోలచెయ్యకు'' కాస్త కఠినంగానే వుంది యాదగిరి మాట.


తనింక మాట్లాడలేదు. మాట్లాడి ప్రయోజనంలేదు. ఆ రాత్రి సుషమ తనని వాటేసుకుని ఏడుస్తుంటే తల్లిపేగు కదిలింది. ''ఇది తన బిడ్డ — దీని బాగోగులు భవిష్యత్తుపై ఎవరికీ అధికారం లేదు. ఏదో ఉపాయం ఆలోచించాలి. యాదగిరి వట్టి మూర్ఖుడు — పైగా వాడికేం — వాడి కూతురు కాదని వాడికీ తెలుసు — దీన్ని అమ్మి సొమ్ముచేసుకుంటాడు. వీల్లేదు''

కృష్ణవేణి ఆలోచన సర్రున తెగింది.

'మేరీ గ్రేస్ సహాయం కోరితే?'

అవును. ఆవిడ దయామయి. తప్పక సాయం చేస్తుంది. ఇన్నేళ్ల జీవితంలో తనెప్పుడైనా కాస్త ఊరట పొందిందీ అంటే ఆవిడ సాహచర్యంలోనే —

మేరీ గ్రేస్ టీచర్ — సుషమ స్కూల్లో మంచి మార్కులు తెచ్చుకుంటుంటే ఆవిడ దానివెంతో అభిమానించేదట. ఒకసారి బ



జారులో పరిచయం చేసింది సుషమ.

అప్పట్నుంచీ దాదాపు ఏడాదినుంచీ తను ఆవిడని అప్పుడప్పుడు కలిసి మాట్లాడుతూనే వుంది. ఇప్పుడావిడ తనకి మంచి నేస్తంకూడా.

ఈ కష్టకాలంలో తనని తప్పకుండా ఆదుకుంటుంది.

○ ● ○

కృష్ణవేణి గోడు విన్న మేరీ ఆలోచించింది.

"మీ భర్త యాదగిరిగారు చాలా పట్టుదల మనిషి అని విన్నాను. నేను కలగజేసుకుంటే కోపం వస్తుందేమో!"

"వస్తే రానివ్వండి. నా కూతురు నా ఇష్టం"

"అదేమాట అతనూ అంటే?"

కృష్ణవేణికి తెగింపు వచ్చింది.

"సుషమ అతని కూతురు కాదు"

ఒక యుగానికి సరిపడేంత నిశ్శబ్దం —

మేరీ గ్రేస్ కృష్ణవేణికేసి పిచ్చిదానిలా చూస్తోంది.

"నేనతని భార్యనూ కాను" మరో బాంబు పేలింది.

ఐదు నిమిషాల తర్వాత మేరీ గ్రేస్ మాట్లాడింది.

"సుషమ గురించి మీరేం భయపడొద్దు. రేపు స్కూలుకి పంపండి. అక్కడ్నుంచి నిశ్శబ్దంగా ఊరుదాటించి హైదరాబాద్ ఆశ్రమానికి పంపిస్తాను. మా అక్క అక్కడ వార్డెన్. ఎవరికీ తెలీదు సుషమ ఎక్కడుందో"

"సుషమ మీ కూతురే అనుకోండి. దాన్ని ఏం చేశారని అడగను. ఒక నెల్లో నేనూ ఈ ఇంట్లోంచి బయటపడతాను. నేనూ నా కూతురూ ఎక్కడో అక్కడ స్వతంత్రంగా బతుకుతాం."

"ఈలోగా రేపట్నుంచీ నన్ను కలవకండి. యాదగిరిగారికి అనుమానం వస్తుంది. వెళ్లండి"

మర్నాడు సాయంత్రం సుషమ ఎంత ఇంటికి రాకపోయేసరికి ఆ రాత్రి భార్యాభ లచేత వాళ్ల ఉక్రోషంలో తిట్టిన తిట్లన్నీ భరించింది కృష్ణవేణి. రెండులక్షలు చేజారిపోయాయనే దుగ్ధతో ఒళ్లు వాచేలా కొ భరించింది మౌనంగా కృష్ణవేణి.

ఏమైనా తన సుషమ ఒడ్డుకు చేరుకు ఈ ఆపదనుంచి గట్టెక్కింది అంతేచాలు అనుకుంది.

కానీ లేడికూనంటే అందరికీ అలుసే అనీ — తన బిడ్డ తన వారసురాలైన మరో లేడికూన అని మర్చిపోయింది కృష్ణవేణి.

ఇంట్లోనుంచి గెంటబడిన కృష్ణవేణి ముందురోజు మేరీ గ్రేస్ ఇచ్చిన హైదరాబాద్ అడ్రస్ తీసుకుని రైలెక్కింది. కాని మేరీగ్రేస్ ఎదురొచ్చిన అవకాశాన్ని వినియోగించుకుందని — రెండులక్షలు తానే చేజిక్కించుకుని సుషమను సుదూర తీరాలకు అమ్మేసిందని తెలియని పిచ్చితల్లి కృష్ణవేణి బహుశా హైదరాబాద్ వెళ్లేవరకు భ్రమలోనే వుంటుంది ఆమె.

○ ● ○